నేడు డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా కోన తాతారావు బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా కోన తాతారావు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. జనసేన పార్టీ గాజువాక నియోజకవర్గానికి చెందిన తాతారావును ప్రభుత్వం డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

రేషన్ డిపోల్లో సందడి

పూర్వ విధానంలో సరకులు పంపిణీ

- కూటమి ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా ప్రారంభం
- మామిడి తోరణాలు, పూలమాలలతో డిపోలను అలంకరించిన డీలర్లు
- తొలి రోజు సాఫీగా రేషన్ పంపిణీ



అనకాపల్లి పట్టణం కోట్నీ వీధిలోని రేషన్ డిపోను పూలమాలలు, బెలూన్లతో అలంకరించిన డీలర్

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

రేషన్ డిపోలు కళకళలాడుతున్నాయి. ప్రభుత్వం ఎండీయూ విధానాన్ని రద్దు చేసి, చౌక ధరల దుకాణాల్లో రేషన్ పంపిణీకి ఆదేశాలు జారీ చేయడంతో ఆదివారం రేషన్ డిపోలను అట్టహాసంగా ప్రారంభించారు. ఆదివారం నుంచి శ్రీకారం చుట్టింది. ఉదయం ఎనిమిది గంటలకే పలువురు కార్డుదారులు రేషన్ డిపోలకు వచ్చారు. డీలర్ల రేషన్ డిపోలకు అరటి, మామిడి ఆకులు, పూలమాలలు, బెలూన్లు కట్టి అందంగా అలంకరించారు. కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, ప్రభుత్వ అధికారులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై చౌక ధరల దుకాణాల్లో రేషన్ పంపిణీని ప్రారంభించారు. కార్డుదారులు ఈపోస్ యంత్రంలో వేలి ముద్రలు నమోదు చేసి, బియ్యం, పంచదార విడిపించుకుని తీసుకెళ్లారు. ఎండీయూ వ్యవస్థ వున్నప్పుడు వాహనం వచ్చిన రోజునే రేషన్ తీసుకోవాలని, లేదంటే ఆ నెలకు లేనట్టేనని, అది కూడా చాలా సేపు క్యూలో నిల్చోవాల్సి వచ్చేదని పలువురు కార్డుదారులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక నుంచి పూర్వ విధానంలోనే రేషన్ డిపోల్లో సరకులు పంపిణీ చేయడం వల్ల తమకు వీలున్నప్పుడు చౌక ధరల దుకాణానికి వెళ్లి రేషన్ తెచ్చుకుంటామని సంతోషంగా చెబుతున్నారు.

రేషన్ దుకాణాలను రానున్న రోజుల్లో మినీ షాపింగ్ మాల్స్‌గా మార్చేలా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆయన ఆదివారం ఉదయం 84వ వార్డు కోటివీధిలోని రేషన్ డిపోలో సరకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్పత్తిదారుల నుంచి హోల్‌సేల్ ధరలకు సరకులు, వస్తువులు కొనుగోలు చేసి, రేషన్ డిపోల ద్వారా ప్రజలకు సరసమైన ధరలకు అందించనున్నట్టు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయూషా, జిల్లా సరఫరా అధికారి కెఎల్ఎస్ మూర్తి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్ఎం రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చోడవరం మండలం రేవళ్లు, రావికమతం మండలం మేడివాడ, బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట రేషన్ డిపోల్లో సరకుల పంపిణీని ప్రారంభించారు. కార్డుదారులు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు తమకు వెసులుబాటు వున్న రోజున చౌక ధరల దుకాణానికి వెళ్లి రేషన్ విడిపించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సరకులు తీసుకువచ్చి అందిజేస్తామని చెప్పారు.

ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఎలమంచిలి పట్టణంలోని సీపీ పేట అచ్యుతాపురం మండలం వెదురువాడ, దొప్పెర్ల, రాంబిల్లి మండలం వెంకటాపురం, మునగపాక మండలం వెంకటాపురంలో రేషన్ పంపిణీని ప్రారంభించారు.

బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలోటీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాకవరపాలెం శెట్టిపాలెంలో నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, అచ్యుతాపురం మండలం దుప్పితూరు, మునగపాక మండలం అరబుపాలెం, రాంబిల్లి మండలం రాజుకోడూరులో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వర రావు రేషన్ పంపిణీని ప్రారంభించారు.



కె.కోటపాడులోని ఒక రేషన్ డిపోలో సరకుల పంపిణీని ప్రారంభిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

నేరాల నియంత్రణకు చర్యలు

అందుబాటులోకి 'సేఫ్ స్టే' యాప్

- జిల్లాలోని లాడ్జిలు, హోటళ్లలో దిగే వారి వివరాలు యాప్‌లో నమోదు
- నేర చరిత్ర ఉంటే పోలీస్ కంట్రోల్ రూమ్‌కి అలర్ట్
- వెంటనే అక్కడకు వెళ్లి తనిఖీలు



నర్సీపట్నంలోని ఒక లాడ్జిలో పోలీసులు అతికించిన సేఫ్ స్టే లోగో స్టిక్కర్

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నేరాలను అదుపు చేయడానికి, ప్రజల భద్రతకు పోలీస్ యంత్రాంగం సాంకేతిక సహకారంతో ముందుకు వెళుతున్నది. హోటళ్లు, లాడ్జిలు, ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లలో రూమ్‌లు అద్దెకు తీసుకొనే అతిథుల కోసం 'సేఫ్ స్టే' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. లాడ్జిల నిర్వాహకుల మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, అక్కడ పని చేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లాలో 80 లాడ్జిలలో యాప్ అందుబాటులోకి తెచ్చారు. అన్ని లాడ్జిలు, హోటళ్లలో సేఫ్ స్టే యాప్ సిక్కర్లు అతికించారు. లాడ్జిలో దిగే అతిథుల చిరునామా, ఫోన్ నంబరు, ఫొటో, ఆధార్ నంబరు వివరాలను సేఫ్ స్టే యాప్‌లో సిబ్బంది నమోదు చేస్తారు. నేర చరిత్ర ఉన్నవారు లాడ్జిలో రూమ్‌లు తీసుకుంటే.. సేఫ్ స్టే యాప్ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్‌కి అలర్ట్ సిగ్నల్ వెళుతుంది. పోలీస్ అధికారులు వెంటనే లాడ్జికి వెళ్లి తనిఖీ చేస్తారు. నేరస్థుల సమాచారంతో సరిపోల్చి అనుమానాస్పద వ్యక్తులు ఉంటే అదుపులోకి తీసుకుంటారు. ఈ యాప్ అందుబాటులోకి రాకముందు లాడ్జిలు, హోటళ్లు, అతిథిగృహాల్లో దిగే అనుమానాస్పద వ్యక్తులు, నేరస్థుల కోసం పోలీసులు భౌతికంగా తనిఖీలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు

... మిగతా 6వ పేజీలో

మాకవరపాలెంలో ఎంఎస్ఎంఈ పార్క్

రామన్నపాలెంలోని ఏపీఐఐసీ భూములు పరిశీలన

- అందుబాటులో సుమారు 300 ఎకరాలు
- కలెక్టర్‌కు రెవెన్యూ అధికారుల నివేదిక
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన విజయకృష్ణన్
- యూనిట్ల ఏర్పాటుకు ఔత్సాహికులు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడి
- సీఎం చంద్రబాబు త్వరలో శంకుస్థాపన చేస్తారంటున్న టీడీపీ నేతలు



ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం పరిశీలిస్తున్న రామన్నపాలెంలో ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న భూములు

మాకవరపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కును ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నర్సీపట్నం నియోజకవర్గానికి సంబంధించిన ఎంఎస్ఎంఈ పార్కును మాకవరపాలెం మండలంలో ఏర్పాటు చేస్తారని తెలిసింది. ఈ మేరకు అధికార కూటమి నేతలు ప్రచారం చేస్తున్నారు. రాచపల్లి రెవెన్యూ పరిధిలోని రామన్నపాలెం వున్న ఏపీఐఐసీ భూములను రెవెన్యూ అధికారులతో పాటు జాయింట్ కలెక్టర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్.. తాజాగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నది.

మాకవరపాలెం మండలంలో అల్యూమినియం కంపెనీ నిర్మాణం కోసం 2007వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 2,450 ఎకరాలను సేకరించింది. అయితే ఇందులో సుమారు రెండు వేల ఎకరాలను మాత్రమే అల్యూమినియం కంపెనీ తీసుకుంది. మిగిలిన భూమి ఏపీఐఐసీ ఆధీనంలోనే ఉంది. ఈ భూమి రాచపల్లి రెవెన్యూ పరిధి రామన్నపాలెం, వెంకయ్యపాలెం, ఎరకన్నపాలెం, చినరాచపల్లి గ్రామాలను అనుకొని ఉంది. రామన్నపాలెంలో ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న సుమారు 300 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అయితే నాడు ప్రతిపక్షంలో వున్న వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేసి ఆ పరిశ్రమ రాకుండా అడ్డుకున్నారు. గత ఏడాది తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా వున్న కూటమి అధికారంలోకి రావడంతో ఇక్కడ ఖాళీగా వున్న ఏపీఐఐసీ భూములను వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని భావించినట్టు తెలిసింది. దీనిపై ఇప్పటికే సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు.. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించారు. ఈ భూములను శనివారం కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. ఏపీఐఐసీ ఆధీనంలో వున్న ఈ భూముల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కు ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు

... మిగతా 6వ పేజీలో

రాంకీ బరితెగింపు

సీఈటీపీ నుంచి వ్యర్థ రసాయనాలు బయటకు విడుదల

- సమీపంలోని మల్లోడి గెడ్డలోకి చేరిక
- తీవ్ర దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



ఫార్మా వ్యర్థ రసాయనాలతో నిండిపోయిన మల్లోడి గెడ్డ



మూడు వారాల క్రితం రసాయన వ్యర్థాలు లేని గెడ్డ

పరవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ నుంచి భరణికం వెళ్లే రహదారిలో మల్లోడి గెడ్డ ఫార్మా వ్యర్థ జలాలతో నిండిపోయి నీరంతా నల్లగా తయారైంది. వాగు పొడవునా నీటిపై పెద్ద ఎత్తున నల్లటి తెట్టు తేలింది. దీని కారణంగా తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. రాంకీకి చెందిన కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ) నుంచి ఇటీవల వ్యర్థ రసాయనాలను శుద్ధి చేయకుండా నేరుగా విడిచి పెట్టడంతో అది నేరుగా పరవాడ ఊర చెరువు పక్కనున్న గెడ్డవాగు నుంచి దిగువ భాగంలో ఉన్న మల్లోడి గెడ్డలోకి కలుస్తోంది. ఈ కారణంగా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల వర్షాల కురవడంతో రాంకీ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా శుద్ధి చేయని ఫార్మా వ్యర్థాలను బయటకు విడిచి పెట్టడం వలనే అవి నేరుగా మల్లోడి గెడ్డ వాగులోకి కలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. 20 రోజుల క్రితం గెడ్డ వాగు అంతా పూర్తిగా ఎండిపోయి ఉండేదని, ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి ఫార్మా వ్యర్థాలతో వాగు పూర్తిగా నిండిపోయిందని

... మిగతా 6వ పేజీలో



ఇందేశమ్మ ఘాట్ రోడ్డు వద్ద వరహా నదిలో వరద నీరు

సర్పా, వరహా నదులకు జలకళ

కోటవురట్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీతోపాటు దానికి ఆనుకుని వున్న మైదానం ప్రాంతంలో ఇటీవల భారీ వర్షాలు పడడంతో వరహా, సర్పా నదులకు జలకళ వచ్చింది. ఈ రెండు నదుల పరివాహక ప్రాంతాలైన రావికమతం, రోలుగుంట, కొయ్యూరు, జి.మాడుగుల మండలాల్లో గత వారం రోజుల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో రెండు రోజుల క్రితం నదుల్లో స్వల్పంగా నీరు ప్రవహించింది. ఆదివారం నాటికి ఇది మరింత పెరిగింది.

మే నెల చివరి వారం, జూన్ మొదటి వారంలో సర్పా, వరహా నదుల్లో వర్షంనీరు ప్రవహించడం ఇంతవరకు చూడలేదని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు.

దీనివల్ల భూ గర్భ జలాలు వృద్ధి చెంది, వ్యవసాయ బోర్లు నుంచి పుష్కలంగా నీరు వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మోదకొండమ్మ జాతర రేపు



మాడుగుల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టింది. ప్రతి ఏటా జూన్ నెలలో వచ్చే మొదటి మంగళవారం అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. జాతరకు నెల రోజుల ముందు ప్రధాన ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహం, పాదాలు, ఘటాలను ఊరేగింపుగా శతకంపట్టు వద్దకు తీసుకెళ్లి కొలువు తీర్చడం సంప్రదాయం. ప్రస్తుతం శతకం పట్టు వద్ద అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. మూడో తేదీ సాయంత్రం అమ్మవారి విగ్రహం, పాదాలు, ఘటాలను ఊరేగింపుగా తిరిగి ఆలయానికి తీసుకొస్తారు. అమ్మవారి జాతరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు షురూ..

విధి విధానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు

- ఒకేచోట ఐదేళ్లు దాటి పనిచేస్తున్న ఉద్యోగులకు తప్పని స్థానచలనం

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. ఇప్పటికే ఇతర ప్రభుత్వ శాఖల్లో బదిలీలు జరుగుతుండగా.. ఆరోగ్య శాఖలో మాత్రం ఈ ప్రక్రియ ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల కాకపోవడం వల్ల కాస్త ఆలస్యమైంది. అయితే శనివారం రాత్రి ఆరోగ్య శాఖ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంతోపాటు బోధనాస్పత్రుల్లో ఐదేళ్లకు మించి ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కలగనున్నది. 25 ఏళ్ల తరువాత జూనియర్ అసిస్టెంట్లను కూడా బదిలీ చేస్తున్నారు.

ఇవీ మార్గదర్శకాలు..

బదిలీల మార్గదర్శకాల ప్రకారం ఒకేచోట ఐదేళ్లు దాటి పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీ తప్పదు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లో ఆఫీస్ బేరర్లుగా ఉండి ఒకే ఇన్‌స్టిట్యూట్‌లో మూడు నుంచి తొమ్మిదేళ్లలోపు పని చేస్తున్న వారిని తప్పనిసరిగా మరో ఇన్‌స్టిట్యూట్ (లోకల్)కు మార్చాల్సి ఉంటుంది. లోకల్‌గా లేకపోతే బయటకు వెళ్లాల్సి ఉంటుంది. తొమ్మిదేళ్లు దాటితే తప్పనిసరిగా బదిలీ

... మిగతా 6వ పేజీలో

కానిస్టేబుల్ మెయిన్స్‌కు 90.76 శాతం హాజరు

- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కానిస్టేబుళ్ల నియామకాలకు సంబంధించిన మెయిన్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 27 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 12,491 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 11,338 (90.76 శాతం) మంది హాజరయ్యారు. ఆయా కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8 గంటలు నుంచే అభ్యర్థులు బారులుతీరారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. జిల్లాలోని పరీక్ష కేంద్రాలకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోపలకు అనుమతించారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ సెంటర్లను పోలీస్ అధికారులు మూసివేయించారు. కాగా పలు కేంద్రాలను నగర ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, డీసీపీలు అజిత వేజెండ్ల, డి.మేరీప్రశాంతి, శ్రీకృష్ణకాంత్‌లు పరిశీలించారు.

పెదపల్లిలో వేమాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు



ఎలమంచిలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ లోని పెదపల్లిలో మంగళవారం వేమాంబిక జాతర జరగనున్న నేపథ్యంలో ఆదివారం అమ్మవారి ఘటలను ఊరేగించారు. మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ పురవీధుల్లోకి ఘటాలు రావడంతో భక్తులు దర్శించుకున్నారు. జాతరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ముసిలితల్లి వేడుక



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అచ్యుతాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలమ్మపాలెంలో ఆదివారం ముసిలితల్లి అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దరించుకున్నారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

గ్రామాల్లో అమ్మవార్ల సంబరాలు



సత్తెమ్మతల్లికి నైవేద్యం సమర్పించిన భక్తులు

మునగపాక, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతల పండుగలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మునగపాకలో ములబందగోడి, చెరువు కాలువ రైతు మూల సంఘాల ఆధ్వర్యంలో సత్తెమ్మతల్లి వేడుకలను జరిపారు. అదే విధంగా ముసిలితల్లి, కొత్త మహాలక్ష్మి అమ్మవార్ల పండుగలను కూడా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు దాడి శివ, ఆడారి అప్పారావు, దాడి సూర్యనారాయణ, సూరిశెట్టి దుర్గనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పండుగలా రేషన్ డిపోల ప్రారంభం

- పలుచోట్ల లబ్ధిదారులకు సరకులను పంపిణీ చేసిన రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ, ఎమ్మెల్యే సుందరపు



అచ్యుతాపురం మండలం దుప్పితూరులో డిపోను ప్రారంభిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు



రాంబిల్లి మండలం వెంకటాపురంలో సరకులు అందిస్తున్న ఎమ్మెల్యే

మునగపాక, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల వ్యవస్థకు జవసత్వాలు తీసుకు వచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం మునగపాకలో డిపో-2, 3లతో పాటు అరబుపాలెం డిపోను ప్రారంభించి లబ్ధిదారులకు సరకులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. వెంకటాపురం గ్రామంలో డిపోను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన తప్పులను సరిచేసి పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడం జరుగుతుందన్నారు. పీఏసీఎస్ సముదాయంలో ఉన్న డిపో ద్వారా సరకుల పంపిణీని తహసీల్దార్ ఏఎస్‌మహేశ్వరరావు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, గవర, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు బీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, జిల్లా తెలుగు మహిళా నాయకురాలు ఆడారి మంజు, వీర మహిళ సుందరపు ధనలక్ష్మి, టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, టెక్కలి పరశురాం, దాడి మునిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, సూర్యనారాయణలతో పాటు ఆయా డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డులో..

ఎలమంచిలి మండలంలో...

ఎలమంచిలి : రేషన్ డిపోల ద్వారా సరకుల పంపిణీ ఆదివారం పండుగ వాతావరణం నడుమ ప్రారంభమైంది. ఎలమంచిలి మునిసిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి నాయకులు డిపోలను ప్రారంభించారు. సీపీ పేటలోని రేషన్ డిపోను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించి, సరకులను పంపిణీ చేశారు. కొక్కిరాపల్లిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, ఆర్ఎస్ రోడ్డులో డిపోను కూటమి నాయకులు ఊడి బాబులు, సుందరపు బాబ్జి, గుర్రాల శేఖర్, కరెడ్ల మల్లికార్జునరావు, సాగర్ హౌస్సెన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు పిట్టా శ్రీను, దొడ్డి వెంకటేశ్, డీలర్లు ఈశ్వరావు, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలంలో...

అచ్యుతాపురం : మండలంలో రేషన్ డిపోల ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. దుప్పితూరులో రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ప్రారంభించగా, వెదురువాడ, దొప్పెర్లలలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించి లబ్ధిదారులకు సరకులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు దేశంశెట్టి ఎల్లయ్యనాయుడు, డి.వెంకటరమణ, బైలపూడి శ్రీరామదాసు, కొయ్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి : రేషన్ డిపోల ప్రారంభోత్సవం మండల వ్యాప్తంగా కోలాహల వాతావరణంలో సాగింది. వెంకటాపురంలో డిపోను ఎమ్మెల్యే విజయకుమార్, రాజుకోడూరులో డిపోను రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ప్రారంభించి లబ్ధిదారులకు సరకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ రవికుమార్, టీడీపీ మండల నాయకుడు వి.దినబాబు, జనసేన పార్టీ రాంబిల్లి మండల శాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, కూటమి నాయకులు ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైస్ ఎంపీపీ ఉమా



జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి వైస్ ఎంపీపీ-2, వైసీపీకి చెందిన నాయకురాలు శిలపరశెట్టి ఉమాతో పాటు మరో ఇద్దరు వైసీపీ నేతలు రాజు, శేషు ఆదివారం జనసేనలో చేరారు. వైస్ ఎంపీపీ-1 రాజాన శేషు ఆధ్వర్యంలో వీరికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'కూటమి వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లండి'



సమావేశంలో మాట్లాడుతున్న కన్నబాబురాజు

అచ్యుతాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే యూవీ రమణ మూర్తి రాజు (కన్నబాబు రాజు) పిలుపునిచ్చారు. ఆదివారం కొండకర్లలోని ఆయన అతిథిగృహంలో ఏర్పాటైన నియోజకవర్గ స్థాయి వైసీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరఫునే పోటీ చేస్తానన్నారు. చనిపోయే వరకు వైసీపీ జెండాను వదలనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, హైమావతి, కోన లచ్చం నాయుడు, మారిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో సరకుల పంపిణీ పునఃప్రారంభం



పాయకరావుపేట: గుంటపల్లిలో రేషన్ పంపిణీ చేస్తున్న జనసేన నేత గెడ్డం బుజ్జి



నక్కపల్లి: ఉపమాకలో సంకుల పంపిణీని ప్రారంభిస్తున్న కొప్పిశెట్టి బుజ్జి



ఎస్.రాయవరం: వెంకటాపురంలో సరకులు సరఫరా చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అనువైన సమయంలో రేషన్ సరకులు తెచ్చుకునేందుకు వీలుగా కూటమి ప్రభుత్వ రేషన్ డిపోలను పునఃప్రారంభించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో ఆదివారం రేషన్ డిపోలను ప్రారంభించారు. పాయకరావుపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలు తదితరులతో కలిసి ఆయన డిపోల్లో సరకుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలను గుర్తించి రేషన్ డిపోలను ప్రభుత్వం ప్రారంభించిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ జి.ఆనంద్ మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల్లో 28,179 తెల్ల రేషన్ కార్డులు, 1,111 ఏఏవై కార్డుదారులు ఉండగా, వారందరికీ 50 రేషన్ డిపోల ద్వారా ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రెండు పూటలా సరకులు పంపిణీ చేస్తామని చెప్పారు. అలాగే గుంటపల్లిలో జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి రేషన్ పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, వీఆర్వో వెంకటేశ్, కూటమి నాయకులు మజ్జూరి నారాయణరావు, ఎం.వెంకటరమణ, విలియంకేరి, జె.ప్రసాద్, ఎం.రమాకుమారి, వి.అప్పారావు, ఎ.దొర, ఎస్.పద్మ, ఎం.దుర్గాప్రసాద్, చిక్కాల శ్రీనివాసరావు, ఏనుగు చిన్నా, పెదిరెడ్డి శ్రీరాములు, కీర్తి సీతారాం, నాగేశ్వరరావు, డి.వెంకటరావు, కె.శివ, గొర్ల లక్ష్మీనారాయణ, నాగం వెంకటరత్నం, గెడ్డం కన్నబాబు పాల్గొన్నారు.



కోటవురట్ల రేషన్ షాపులో సరకులు అందిస్తున్న తహసీల్దార్

కోటవురట్లలో...

కోటవురట్ల: కోటవురట్ల-1, రాట్నాలపాలెంలో రేషన్ డిపోల్లో సరకుల పంపిణీ ప్రక్రియను తహసీల్దార్ తిరుమలబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరకులు పారదర్శకంగా పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు మాట్లాడుతూ లబ్ధిదారుల మంచి కోసమే డీలర్ల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీసీనియర్ నేత జానకి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పి.సూర్యరావు, స్థానిక నాయకుడు జానకి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: మండలంలోని గొడిచెర్లలో రేషన్ డిపోను ఆదివారం పునఃప్రారంభించారు. రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ బోడపాటి శివదత్, ఉపమాక దేవస్థానంమాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జితో కలిసి తహసీల్దార్ నరసింహమూర్తి ఈ కార్యక్రమం చేపట్టారు. ఉపమాకలో జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు కొండబాబు చౌక ధరల దుకాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో రేషన్ డిపో డీలర్ల సంఘం ప్రతినిధులు నల్లల ఈశ్వరరావు, కొప్పిశెట్టి హరిబాబు, కూటమి నాయకులు జగదీశ్వరరావు, నల్లల దొరబాబు, కొప్పిశెట్టి వాసు, తోట అప్పారావు, చంద్రరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ దుకాణాలను పునఃప్రారంభించారు. కొరుప్రోలు గ్రామంలో రేషన్ డిపోను ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి, వెంకటాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, గుడివాడ గ్రామంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు ఈ దుకాణాలను పునఃప్రారంభించారు. అలాగే మరికొన్ని గ్రామాల్లో స్థానిక నాయకుల చేతుల మీదగా రేషన్ డిపోలను పునఃప్రారంభించి వినియోగదారులకు సరకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, పల్లెల జగ్గారావు, ముప్పిన శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులకు సత్కారం

పాయకరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు చేపట్టిన టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబును పలువురు బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీరంగం రమేశ్ తదితరులు పాయకరావుపేటలో చించెలపు ప్రదీప్, వరహాలబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంచాల గాంధీ, పట్టణ అధ్యక్షుడు కువల కుమార్, నాయకులు కోనే రంగయ్యస్వామి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో సందడిగా వున్న ఆలయ ప్రాంగణం

నక్కపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ముందుగా అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ చేశారు. అనంతరం శ్రీసూక్తం, దుర్గా సూక్తం, అష్టోత్తర శతనామార్చన, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. యానాం, రాజమహేంద్రవరం, ఊడూరు, నక్కపల్లి, ఉపమాక, తుని, పాయకరావుపేట ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను దర్శించుకున్నారు. అలాగే అక్కడ వంటలు చేసుకుని భోజనాలు చేశారు.

టీచర్ పోస్టు భర్తీచేయాలని నిరసన

కోటవురట్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టివాడ శివారు అణుకు పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పోరాటాల కారణంగా గ్రామానికి రోడ్డు నిర్మించాలని, అలాగే గ్రామంలో విద్యార్థులు కోసం పాఠశాల ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పట్లో జిల్లా కలెక్టర్ విద్యా వలంటీర్లను నియమించగా, తర్వాత తొలగించారన్నారు. దీంతో పిల్లలు చదువుకు దూరమై బాల కార్మికులుగా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల పునఃప్రారంభంలోగా ఉపాధ్యాయులను నియమించాలని ఆయన కోరారు.

పాము కాటు బాధితురాలికి ఆర్థిక సాయం

ఎస్.రాయవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద ఉప్పలం గ్రామానికి చెందిన పోలవరపు సూర్యవతి అనే ఉపాధి శ్రామికురాలు పాము కాటుకు గురికవడంతో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు, సీనియర్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యవతికి వైద్య ఖర్చుల నిమిత్తం కొంత నగదును అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.వీర్రాజు, కె.లోవరాజు, పిసూర్యరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల్లో తొలగని గందరగోళం

- ఏజెన్సీలో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు స్కూల్ అసిస్టెంట్ల విముఖత
- ఇంకా 26 ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీ
- ఎస్జీటీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం కొనసాగుతోంది. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్‌అసిస్టెంట్లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయమే దీనికి కారణమన్న వాదన ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించడాన్ని ఎస్జీటీలు వ్యతిరేకిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు పని భారం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన చేసిన స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంగా వెళితే మూడు నుంచి ఐదు తరగతులకు బోధన చేయడం ఏమిటన్న వాదన వారిలో ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో సర్దుబాటుతో మిగిలిన స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు సమ్మతించినా... ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు వెళ్లడానికి విముఖత చూపుతున్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా వెళ్లడానికి స్కూల్ అసిస్టెంట్లకు ఇచ్చిన గడువు ముగిసింది. మొత్తం 563 పాఠశాలల్లో ఇంకా 26 పాఠశాలలకు ఎవరూ ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో మిగులుగా ఉన్న 86 మంది స్కూల్ అసిస్టెంట్లలో 26 మందిని ఏజెన్సీకి పంపనున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి వారిని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పంపితే మంచిదని ఎస్టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభిప్రాయపడ్డారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. యువకుడి మృతి



పవన్‌కుమార్ (ఫైల్)

ఎస్.రాయవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం సమీపంలో ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. వమ్మవరం గ్రామానికి చెందిన కొరుప్రోలు పవన్‌కుమార్, సమీపంలో ఉన్న అగ్రహారం గ్రామానికి చెందిన తన స్నేహితుడైన యాదగిరి భాస్కరరావుతో కలిసి బైక్‌పై పెనుగొల్లు వైపు వెళుతున్నారు. వమ్మవరం శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న పవన్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. భాస్కరరావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పవన్‌కుమార్ తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి నిందితుల అరెస్టు

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన కె.హరీశ్, యు.కన్నన్ రైలులో విశాఖపట్నం వచ్చారన్నారు. చీడికాడ మండలానికి చెందిన ఓ వ్యక్తితో వారికి పాత పరిచయం ఉందని తెలిపారు. అతని దగ్గర ఎనిమిది కిలోల గంజాయి కొలుగోలు చేసి బ్యాగులో రెండేసి ప్యాకెట్లు చొప్పున పెట్టుకుని నర్సీపట్నం వచ్చారని, ఇక్కడ నుంచి బస్సులో తుని వరకు వెళ్లి రైలులో కోయంబత్తూరు వెళ్దామని ప్లాన్ చేసుకున్నారని సీఐ తెలిపారు. చోడవరం రోడ్డులో ఇద్దరు నడుచుకుని వస్తుండగా పెదబొడ్డేపల్లి కూడలి వద్ద పట్టణ ఎస్ఐ రమేశ్ అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరిలో హరీశ్‌కు గంజాయి తాగే అలవాటు ఉందని, కన్నన్ పొట్లాలు కట్టి విక్రయిస్తుంటాడని ఆయన చెప్పారు. వారి నుంచి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితులపై అట్రాసిటీ కేసు

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిఘట్టానికి చెందిన అల్లంపల్లి ఈశ్వరరావుపై దాడి చేసిన పప్పల అప్పలనాయుడు, రేలంగి రాజేశ్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు కేసును దర్యాప్తు చేస్తున్నారని ఆయన తెలిపారు. పాల్‌ఘాట్ సెంటర్‌లో సీసీ ఫుటేజీలు పరిశీలించామని, ఈశ్వరరావుపై ఇద్దరు నిందితులు పిడి గుద్దులతో దాడి చేసినట్టు ఫుటేజీలో కనిపిస్తుందని సీఐ వివరించారు. అల్లంపల్లి ఈశ్వరరావు, పప్పల అప్పలనాయుడుపై రౌడీషీట్లు ఉన్నాయన్నారు. పోలీసు స్టేషన్‌లో అప్పలనాయుడుపై 17, ఈశ్వరరావుపై తొమ్మిది కేసులు ఉన్నాయని తెలిపారు. కౌన్సిలర్‌పై సోషల్ మీడియా వేదికగా దూషణలు చేయడంతోనే ఈశ్వరరావుపై దాడి చేశామని నిందితులు చెప్పారని సీఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరాపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతగిరి మండలం కివర్ల గ్రామానికి చెందిన కేత దేముడు దేవరాపల్లి నుంచి కివర్ల వైపు వెళ్తుండగా, పెదబయలు నుంచి దేవరాపల్లి వైపు వస్తున్న ఎస్.ప్రసాద్ జీనబాడు వద్ద ఎదురెదురుగా బైకులతో ఢీకొన్నారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.

'మాకవరపాలెం'లో ఎంఎస్ఎంఈ పార్క్

..... 5వ పేజీ తరువాయి

సిద్ధంగా వున్నట్టు చెప్పారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని తెలుగుదేశం పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇది ఏర్పాటైతే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు.

రాంకీ బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు తక్షణమే స్పందించి రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యర్థ జలాలు విడిచిపెట్టడం వలన భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

ఆ అవసరం లేదు. యాప్ నుంచి అలర్ట్ వచ్చినప్పుడు లాడ్జికి వెళ్లి తనిఖీ చేస్తే సరిపోతుంది. నేరాలను అదుపు చేయడానికి, ప్రజలకు భద్రత కల్పించడానికి ఈ యాప్ చాలా ఉపయోగ పడుతుందని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. రోజూ యాప్ నుంచి అలర్ట్‌లు వస్తున్నాయని, సీఐలు, ఎస్ఐలు వెళ్లి తనిఖీ చేస్తున్నారని చెప్పారు.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు షురూ..

... 5వ పేజీ తరువాయి

కావాలి. ఆఫీస్ బేరర్స్ కాని ఉద్యోగులు మూడు నుంచి ఐదేళ్లలోపు ఒకే ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తుంటే.. తప్పనిసరిగా లోకల్‌గా ఉన్న మరో ఇన్‌స్టిట్యూట్‌కు బదిలీ కావాల్సి ఉంటుంది. లోకల్‌గా ఖాళీ లేకపోతే తప్పనిసరిగా మరో ప్రాంతానికి వెళ్లాల్సిందే. ఉద్యోగి బదిలీ కావాలనుకుంటే ఐదు ప్రాంతాలను ఆప్షన్‌గా ఎంచుకోవచ్చు. ఈ మేరకు ఆయా కేటగిరీలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలను ఈ నెల మూడో తేదీలోగా కార్యాలయా ఆవరణలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఉద్యోగులు తమ దరఖాస్తులను బదిలీ అధికారికి మూడో తేదీలోగా అందించాలి. మార్పులు, చేర్పులకు సంబంధించి 4, 5 తేదీల్లో కంట్రోలింగ్ అధికారికి అందించవచ్చు. 6 నుంచి 8వ తేదీలోగా ఉన్నతాధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలిస్తారు. 9న ఉద్యోగులు ఎంపిక చేసుకున్న స్థానాలతో కూడిన జాబితాను పొందుపరిచి గ్రీవెన్స్‌లను కోరతారు. ఏమైనా అభ్యంతరాలుంటే 10, 11 తేదీల్లో తెలియజేయవచ్చు. 12 నుంచి 14వ తేదీ వరకు అభ్యంతరాలను నివృత్తి చేసి తుది జాబితాను రూపొందిస్తారు. 15 నుంచి 17వ తేదీ వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

నూకాంబిక ఆలయం కిటకిట

- వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తజనం
- రోడ్డుపైకి చేరిన క్యూలైన్లు
- బాలాలయంలో అమ్మకు పూజలు



అనకాపల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అన కాపల్లి నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి రావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. తెల్లవారుజామున అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి విశేష అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆల యం లోపలు, వెలుపల క్యూలైన్లు నిండిపోయాయి. కుటుంబాలతో విచ్చేసిన వారిలో చాలా మంది ఆలయ ఆవరణతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. ఈవో వెంపలి రాం బాబు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ, ట్రాఫిక్ పోలీసు అధికారులు బందోబస్తుతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు.



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

సత్యనారాయణపురంలో నూకాంబిక పండుగ



అమ్మవారిని దర్శించుకుంటున్న పీలా గోవింద

కొత్తూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో నూకాంబిక అమ్మవారి పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణతో పాటు కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దరించుకున్నారు.

'యోగా భారతదేశపు వారసత్వ సంపద'

సబ్బవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని యోగా గురువు పొనపరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతున్న యోగా శిక్షణ శిబిరంలో ఆయన పలు ఆసనాలపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా భారతదేశపు వారసత్వ సంపదగా పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో యోగా ప్రాధాన్యత పెరుగుతుండగా, భారతదేశంలో క్రమంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యోగాయే సర్వరోగ నివారిణిగా అంతా గుర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యోగా శిక్షకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్పృహ కోల్పోయి డ్రైవర్ మృతి

లంకెలపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పూటుగా మద్యం సేవించి ఓ డ్రైవర్ మృతిచెందిన సంఘటన లంకెలపాలెం ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖపట్నానికి చెందిన జి.ధనపాల్ బాలాజీ (55) ఫార్మాసిటీలో ఓ వాహనానికి ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పూటుగా మద్యం సేవించి ఇక్కడున్న బ్రిడ్జి వద్ద స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఎంతటికీ తెలివి రాకపోవడంతో స్థానికులు పరవాడ పోలీసులు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా, అప్పటికే మృతిచెందిన ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిని పూర్తి వివరాలకు తెలియాల్సి ఉందనిసీఐ మల్లికార్జునరావు తెలిపారు.

పురుగుల మందు తాగి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



వరుణ్ మృతదేహం

అనకాపల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని మార్టూరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించి, ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకారం వివరాలివి. మార్టూరు గ్రామానికి చెందిన కరణం వరుణ్ (22) బీటెక్ చేశాడు. గత కొంతకాలంగా మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. తుమ్మపాల ఏలేరు కాలువ గట్టు మీదుగా బొజ్జన్నకొండకు వెళ్లే మార్గంలోని ఆంజ నేయస్వామి గుడి వద్ద అతడు శనివారం పురుగుల నివారణకు వినియోగించే మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గుర్తించిన తుమ్మపాల వాసులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కుటుంబ వివరాలను అతడి నుంచి తెలుసుకుని తల్లిదండ్రులకు సమాచారం అం దించడంతో వారు ఆసుపత్రికి విచ్చేశారు. ప్రథమ చికిత్సల అనంతరం వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా, స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న వరుణ్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకట అప్పాజీరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539



దాసరిగెడ్డ రోడ్డులోని డిపోలో రేషన్ పంపిణీ చేస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు



కశింకోట మండలం బయ్యవరంలో సరకులు పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాబర్



పరవాడ మండలం తానాం డిపోలో సరకులు అందిస్తున్న పంచకర్ల ప్రసాద్, తదితరులు



సబ్బవరం మండలం ఆరిపాకలో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, నాయకులు

సందడిగా సరకుల పంపిణీ

- పండుగ వాతావరణంలో రేషన్ దుకాణాలు ప్రారంభం
- ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు
- ఆనందంగా విచ్చేసిన కార్డుదారులు
- భవిష్యత్తులో మినీ షాపింగ్ మాల్స్‌గా మార్పు చేసే యోచన : ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డిపోల ద్వారా సర కుల పంపిణీ ఆదివారం కోలాహల వాతావరణం నడుమ ప్రారంభమైంది. ఆయా దుకాణాల వద్దకు లబ్ధిదారులు వెళ్లి సరకులను ఆనందంగా విడిపించుకున్నారు. అనకాపల్లి పట్టణంలో 37 రేషన్ డిపోలను ఆయా డీలర్లు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జీవీఎంసీ 84వ వార్డు కోట్నివీధి 15వ నంబరు చౌక ధరల దుకాణంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సరకులను అందజేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో రేషన్ షాపులను మినీ షాపింగ్ మాల్స్‌గా మార్పు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు చెప్పారు. కంపెనీల ద్వారా సరకులు హోల్‌సేల్ ధరలకు కొనుగోలు చేసి ప్రజలకు సరసమైన ధరలకు అందించనున్నట్టు వివరించారు. గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా ఇంటింటికీ సరకులు పంపిణీ సక్రమంగా అమలు కాని కారణంగా రేషన్ షాపుల ద్వారా సరకులు పంపిణీ పథకాన్ని ప్రభుత్వం పునఃప్రారంభించినట్టు చెప్పారు. త్వరలోనే లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతుంద న్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వైస త్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా పౌర సరఫరా అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్ఎం రాధాకృష్ణ, తహసీల్దార్ బి. విజయ్‌కుమార్, విజిలెన్స్ కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. 81వ వార్డు పరిధి దాసరిగెడ్డ రోడ్డులోని డిపో వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు రేషన్ పంపిణీని ప్రారంభించారు.



అనకాపల్లి కోట్నివీధిలో రేషన్ దుకాణం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల, డీఆర్వో, ఆర్డీవో తదితరులు

కశింకోట మండలంలో...

కశింకోట : మండలంలో రేషన్ సరకుల పంపిణీ పండగ వాతావరణంలో ప్రారంభైంది. కశింకోటలో రేషన్ డిపోను కూటమి నాయకులు ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి డిపోలో నిత్యావసర సరకులను పరిశీలించారు. కన్నూరుపాలెం, బయ్యవరం, కశింకోట తదితర గ్రామాల్లో లబ్ధిదారులు ఆనందంగా సరకులు విడిపించుకుని వెళ్లారు. ఈకార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ కాండ్రపు నాయుడు, నాయ కులు చుక్క ప్రసాద్, కన్నూరు ఏరినాయుడు, ఎంపీటీసీ రెడ్డి అయ్యలనాయుడు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.బాబర్, చిదిరెడ్డి గీత సత్య ప్రసాద్, సీరం వెంకటలక్ష్మి, ఈశ్వర అప్పారావు, తాకాశి కృష్ణ, కాండ్రేగుల సతీష్, దాసరి బాబు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, రాము పాల్గొన్నారు.

పరవాడ మండలంలో...

పరవాడ/లంకెలపాలెం : మండలవ్యాప్తంగా రేషన్ దుకాణాల ప్రారంభోత్సవాన్ని పండుగలా నిర్వహించారు. తానాంలో రెండు దుకాణాలను జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ ప్రారంభించి సరకులు అందజేశారు. సర్పంచ్ కన్నూరు దేవి, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, ఎంపీటీసీ రొంగలి సునీత, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ పాల్గొన్నారు. ఈ బోనంగిలో రేషన్ దుకాణాన్ని మండల ప్రత్యేకాధికారిణి సరోజిని ప్రారంభించారు. తహసీల్దార్ అంబేడ్కర్, సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్, బుగిడి రామగోవిందరావు పాల్గొన్నారు. లంకెలపాలెంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, కూటమి నేతలు డిపోను ప్రారంభించారు. సాలాపువానిపాలెంలో మాజీ జడ్పీటీసీ మాదంశెట్టి నీలబాబు డిపోను ప్రారంభించారు. కూటమి నాయకులు సాలాపు మోహన్‌రావు, సుమన్ అప్పారావు, నాగరాజు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం: మండలంలో రేషన్ దుకాణాల ప్రారంభోత్సవం ఆనందోత్సాహాల నడుమ సాగింది. సబ్బవరం, అంతకాపల్లి, బంగారమ్మపాలెం, బాటజంగాలపాలెం, ఆరిపాక, మలునాయుడుపాలెం, మొగలిపురం తదితర గ్రామాల్లో నాయకులు ప్రారంభించారు. తహసీల్దార్ చిన్నికృష్ణ, పౌర సరఫరాల అధికారిణి లీలాశేషుకుమారి, నాయకులు గండి ముత్యాలనాయుడు, కర్రి కనకరాజు, గొర్లి రాము నాయుడు, చొక్కాకుల గోవింద తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ మోడల్ టెస్టుకు స్పందన

- పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహణ
- వంద మంది వరకు అభ్యర్థులు హాజరు



మోడల్ టెస్టు హాజరైన అభ్యర్థులు, పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో ఆదివారం డీఎస్సీ మోడల్ టెస్టు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వివిధ సబ్జెక్టులలో జరిగిన ఈ పరీక్షకు సుమారు వంద వరకు అభ్యర్థులు హాజరయ్యారు. తొలుత పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రతినిధులు బుద్ద కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రణాళికతో ముందుకు సాగితే సాధించలేనిది ఉండదన్నారు. తెలుగు, మ్యాథ్స్, సోషల్, ఇంగ్లీషు, పీఎస్, బయాలజీ, ఎస్జీటీ పోస్టులకు నిర్వహిస్తున్న పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రతినిధులు జి.అప్పా రావు, చంటి బాబు, గంగాధర్, అప్పలనాయుడు, జగదీష్, డీవీఎస్‌కే నాయుడు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు బంగారు నామాలు

పరవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీ వద్ద గల కొండపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఇటీవల ప్రతిష్ఠించిన లక్ష్మీదేవి, గోదాదేవి అమ్మవార్లకు ఇక్కడి పోర్టికో టౌన్‌షిప్‌నకు చెందిన ఎస్.లక్ష్మీనరసింహరావు సీతారత్నం దం పతులు ఆదివారం బంగారు నామాలను బహూకరించారు. రూ.20 వేలు విలువ చేసే వీటిని ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావుకు అందజేశారు.




రైతులకు సాగుపై సూచనలిస్తున్న ఏడీఏ సుబ్రహ్మణ్యం

సాగులో ఆధునిక పద్ధతులతో సత్ఫలితాలు

- జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ సుబ్రహ్మణ్యం

కశింకోట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వరి సాగు, నారుమడి యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాని జిల్లా రిసోర్సెస్ సెంటర్ ఏడీఏ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని నర్సింగబిల్లి, జెడ్.తుని, నూతనగుంటపాలెం సచివాలయాల ప్రాంగణాల్లో ఆదివారం ఏర్పాటైన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. సాగులో ఆదునిక పద్ధతులు అవలంబిస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. ఉద్యాన విస్తరణాధికారిణి ప్రవీణ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు, బిందు సేద్యంపై వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు మాట్లాడుతూ సహజ ఎరువుల వాడకం గురించి రైతులకు తెలియజేశారు. మండల వ్యవసాయాధికారిణి స్వప్న మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి మాట్లాడుతూ పశు గ్రాస సాగు గురించి, వర్షాకాలంలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



పాత సామాన్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

అనకాపల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న పాత సామాన్లు దుకాణంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం మంటలు చెలరేగడాన్ని చూసి దుకాణ యజమాని టేకు సత్తి బాబుకు స్థానికులు తెలియజేయడంతో వెంటనే ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. దీంతో అగ్నిమాపక అధికారి పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

సబ్బవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీ బుధవారాన్ని వెన్నుపోటు దినంగా పాటించనున్నామని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతున్నారని ఆరోపించారు. ఇందుకు నిరసనగానే వెన్ను పోటు దినాన్ని పాటించి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. నాయకులు బయలపూడి జయరాం, కొటాన రాము, ఉప్పిలి కనకరాజు, ఎస్. ముత్యా లనాయుడు, ధనిమిరెడ్డి శ్రీను, గంగ్రెడ్డి మహాలక్ష్మీనాయుడు, పాలిశెట్టి సురేశ్‌రాజ్, హేమంత్‌కుమార్, ఎర్రా శ్రీను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్తు

- ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు



విద్యార్థులతో గ్రంథాలయం ప్రతినిధులు, శిక్షకులు

అనకాపల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ మేధ, వర్చువల్ రియాలిటీ, బ్లాక్‌చైన్, రోబోటిక్స్, క్వాం టమ్ కంప్యూటింగ్ తదితర ఆధునిక రంగాలదేని భవిష్యత్తు అని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు అన్నారు. ఇక్కడి గౌరీ గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు ముగిసిన సందర్భంగా ఆది వారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేం దుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి గ్రామీణ్ డిజిటల్ సాక్షరతా అభియాన్ పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దైనందిన జీవితంలో అంతర్భాగమైందన్నారు. సాంకేతికతల ద్వారా ప్రయోజనాలను అందిపుచ్చుకోవడం ఎంత అవసరమో, సైబర్ మోసాలకు చిక్కకుండా జాగ్రత్తపడడం కూడా అంతే కీలకమన్నారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ కంప్యూటర్ విద్యపై ఏటా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం శిక్షణ తరగతులు తుది పరీక్షల పోటీ విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, బోధకులు శరగడం కిశోర్‌బాబు, యు.వినీల, కె.లక్ష్మి, గ్రంథాలయ సభ్యుడు కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు.












అరకులోయలో రేషన్ పంపిణీ చేస్తున్న దొన్నుదొర


చింతపల్లిలో డివిజనల్ మేనేజర్ వెంకటేశ్, టీడీపీ నేతలు


కొయ్యూరు: రేవళ్లలో సరుకులు పంపిణీ చేస్తున్న జీసీసీ మాజీ చైర్మన్ ప్రసాద్

అక్రమాలకు తావు లేకుండా రేషన్ పంపిణీ

- ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర
- అట్టహాసంగా డీఆర్ డిపోలు పునః ప్రారంభం

అరకులోయ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు తావులేకుండా అర్హులందరికీ రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయాలని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర అన్నారు. ఆదివారం అరకులోయలో పలు డీఆర్ డీపోల్లో రేషన్ సరుకుల పంపిణీని కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను మార్చిందన్నారు. గతంలో మాదిరిగా డీఆర్ డిపోల్లో నెలలో 15 రోజులు సరకులు పొందేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు.గత ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను భ్రష్టు పట్టించందన్నారు. ఎండీయూ వాహనాలను అక్రమాలకు అడ్డాగా చేసి పేదలకు రేషన్ సం క్రమంగా అందించలేదన్నారు. ఇలా అక్రమాలకు తావులేకుండాఅర్హులందరికీ రేషన్ సరుకులను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లకోయ్ మహదేవ్, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, మండల మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, నాయకులు బూర్జలక్ష్మి, పెదలబుడు వైస్ సర్పంచ్ విజయనిర్మల చందు, నీరజ, గంగ,, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, జీసీసీ మేనేజర్ సురేశ్, డీటీ గోవింద్, సేల్స్‌మేన్లు, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో..


పాడేరు: సుండ్రుపుట్టు డీఆర్ డిపోను ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, తదితరులు

పాడేరురూరల్: మండలంలోని 26 పంచాయతీలలో ఉన్న 45 డీఆర్ డిపోల్లో రేషన్ పంపిణీని ప్రారంభించినట్టు తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు తెలిపారు. పాడేరు పాత బస్టాండ్ సమీపంలో ఉన్న 137వ నంబర్ డీఆర్ డిపోలో ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, వీఆర్‌వో మర్రిచెట్టు రామునాయుడు, నిర్వాహకురాలు ఈశ్వరమ్మ నిత్యావసర సరుకులు పంపిణీని ప్రారంభించారు, పాడేరు, సుండ్రుపుట్టు, పాతపాడేరు, పి.గొందూరు డీఆర్ డిపోల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, వీఆర్‌వో జె.వెంకటలక్ష్మి, గ్రామ పెద్దల సమక్షంలో రేషన్ పంపిణీ చేశారు. వీఆర్‌వోలు రవికుమార్, టీడీపీ నేత పి.సురేశ్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నెలలో 15 రోజులపాటు రేషన్ పంపిణీ: జీసీసీ మేనేజర్

చింతపల్లి: నెలలో 15రోజులు డీఆర్ డిపోల ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్టు స్థానిక జీసీసీ డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ అన్నారు. ఆదివారం చింతపల్లి-1, పెదబరడ, చౌడుపల్లి, అన్నవరం, లోతుగెడ్డ డీఆర్ డిపోల్లో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావుతో కలిసి బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈసందర్భంగా డివిజనల్ మేనేజర్ మాట్లాడుతూ లబ్ధిదారులు కచ్చితమైన తూకంతో, సకాలంలో రేషన్ సరకులు అందజేయాలన్నారు. జీసీసీ మేనేజర్ చల్లంగి సుగునాథం, ఎంఎల్ఎస్ ఇన్‌చార్జి రమణమూర్తి, బంకు ఇన్‌చార్జి రామకృష్ణ, కూటమి నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, శెట్టి నాగేశ్వరరావు, అరడ వీరబాబు, సోమేశ్, దూరి రామకృష్ణ, ఆర్ఐ కృష్ణమూర్తి, సేల్స్ ఉమన్ రత్నం పాల్గొన్నారు.

కొయ్యూరు: నిత్యావసర సరకులలో జరిగే అక్రమాలను అరికట్టాలనే ప్రభుత్వం రేషన్ డిపోలను (డీఆర్ డిపోలను) పునః ప్రారంభించినట్టు జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు సూచించారు. ఆదివారం రేవళ్ళు, మర్రివాడ, ధర్మవరం, బొంకులపాలెం, డౌనూరు తదితర డీఆర్ డిపోల్లో లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ వెంకట లక్ష్మి, తెలుగు మహిళ అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, నాయకులు సుమర్ల సాంబశివ, రాజేశ్వరి,రమాదేవి, డౌనూరు వైస్ ప్రెసిడెంట్ రాజబాబు ఉండా నాగేశ్వరావు అప్పలరాజు, అప్పారావు, బాచి, స్వాతి కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

అనంతగిరిలో..


అనంతగిరలో సరకులను అందజేస్తున్న తహసీల్దార్, జడ్పీటీసీ సభ్యుడు

అనంతగిరి: స్థానిక డీఆర్‌డిపో వద్ద రేషన్ సరకులను తహసీల్దార్ వీ.మాణిక్యం, జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. టీడీపీ కార్యవర్గ సభ్యులు ఎం.జోగులు, జనసేన మండల అధ్యక్షుడు చిట్టం మురళి, టీడీపీ నేత ఎం. రంజిత్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

42 డిపోల్లో రేషన్ ప్రారంభం

జి.మాడుగుల: మండలంలోని 42 డిపోల్లో ఆదివారం అట్టహాసంగా రేషన్ సరకుల పంపిణీని ప్రారంభించారు. జీసీసీ బ్రాంచి మేనేజర్ డి.బాబూరావు ఆధ్వర్యంలో కూటమి నేతలు పాల్గొన్నారు.


జి. మాడుగులలో..

రేషన్‌తో పాటు నిత్యావసరాలు డిపోలోనే అమ్మకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీసీసీ సిబ్బంది ఎన్.కొండబాబు, రామచంద్రరాజు, సింహాచలం రాజు, నిరీక్షణరావు, నాయకులు రామరాజు, వెంకట గంగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

పెదబయలులో..

పెదబయలు: మండలంలోని 23 పంచాయతీల పరిధిలో ఉన్న 39 డీఆర్ డీపోల్లో రేషన్ పంపిణీని ప్రారంభించినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ గండేరు రంగారావు తెలిపారు..సీతగుంట డీఆర్ డిపోలో మిషన్ మొరాయించడంతో ఉదయం 11 గంటలకు రేషన్ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో స్థానిక రామాలయం వద్దనున్న జీసీసీ డిపో వద్ద కూటమి నాయకుల ఆధ్వర్యంలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాడేరు ని యోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిటికెల రాము, నాయకులు కె సన్యాశిరావు, బొర్రా కృష్ణ, కిల్లో భగవాన్, ఫిల్లోన్, సర్పంచ్ పాంగి దుర్గో, ఉప సర్పంచ్ కె వల్లీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో..

హుకుంపేట: డీఆర్ డిపోలను రేషన్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలనిస్థానిక ఎంపీటీసీ సభ్యులు కొమ్మ రమ అన్నారు. ఆదివారం మండలంలోని 33 పంచాయతీలోని డిపోల్లో రేషన్ సరకుల పంపిణీని అధికారులు ప్రారంభించారు. తహసీల్దార్ కృష్ణారావు, టీడీపీ మండల అధ్యక్షులు బొంజుబాబు, సాగరి సత్యవతి, సూర్యకాంతం, మజ్జి మణి, జనసేన నాయకుడు రమకృష్ణ సెల్స్‌మెన్ కళావతి, వైస్ సర్పంచ్ గోవింద్ పాల్గొన్నారు.

డీఆర్ డిపోలకు పూర్వ వైభవం

గూడెంకొత్తవీధి: డీఆర్ డిపోలకు ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకువచ్చిందని టీడీపీ మండలాధ్యక్షుడు ము క్కలి రమేశ్ అన్నారు. ఆదివారం మండల కేం ద్రంలోని డీఆర్ డిపోలో ఉప తహసీల్దార్ దుమంతి సత్యనారాయణతో కలిసి రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యురాలు గం టా నళిని కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో 23 పంచాయతీల పరిధిలో అట్టహాసంగా ప్రారంభమైంది. తహసీల్దార్ నర్సమ్మ పర్యవేక్షణలో టీడీపీ నేతలు స్థానిక జీసీసీ డిపోలో నిత్యావసర సరకులను అందించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ బ్రాంచి మేనేజర్ పి.కుమారస్వామి, ఆర్ఐ వి.రవికుమార్, టీడీపీ నేతలు కె.సన్యాసమ్మ, కె.బలరాం, ఎస్.శంకరరావు, బాబూజీ తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో రేషన్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్ నరసమ్మ

నేటి నుంచి ద్వితీయ ఇంటర్ తరగతులు

- జిల్లా అధికారి భీమశంకరరావు


భీమశంకరరావు

పాడేరురూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 2వ తేదీ నుంచి ద్వితీయ ఇంటర్ తరగతులు ప్రారంభించనున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సొంటేన భీమశంకరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉదయం 9 గంటలకు తరగతులకు హాజరుకావాలన్నారు. మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త దివంగత డాక్టర్.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్య, నోట్‌పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయనున్నామన్నారు. ప్రతీ విద్యార్థికి 75 శాతం హాజరు తప్పకుండా ఉండాలన్నారు.తక్కువ హాజరుంటే పరీక్షల్లో హాల్‌టిక్కెట్లు ఇవ్వమని హెచ్చరించారు. అందువల్ల విద్యార్థులు కళాశాలకు వచ్చేలా వారి తల్లిదండ్రులు చర్యలు చేపట్టాలని సూచించారు. యోగాంధ్ర నేపథ్యంలో జూన్ 21వ తేదీ వరకు కళాశాలలో తొలి పి రియడ్ యోగా తరగతులు నిర్వహిస్తామన్నారు. అలాగే, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరాలని కోరారు. విద్యార్థులకు కళాశాలలో మధ్యాహ్న భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

జీకే వీధిలో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


డంపింగ్ యార్డులో వేస్తున్న చెత్త

గూడెంకొత్తవీధి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పేరుకుపోయిన చెత్తను ఆదివారం పంచాయతీ అధికారులు తొలగించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోని తీసుకొచ్చేందుకు పనులు ప్రారంభించారు. స్థానికులు ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్యలపై మే 30 తేదీన 'పారిశుధ్యం ఇంత అధ్వానమా?' శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ దినేశ్ కుమార్, పాడేరు డీఎల్‌పీవో పీఎస్ఎన్ కుమార్ స్పందించారు. తక్షణమే జీకేవీధిలో వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావుని ఆదేశించారు. ఈమేరకు ఆదివారం పంచాయతీ కార్యదర్శి గెద్దం మంగరాజు వీధులను శుభ్రం చేయించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. మట్టితో పూడ్చివేశారు. సంపద కేంద్రాన్ని శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించారు.పారిశుధ్య సమస్య పరిష్కార చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


సంపద కేంద్రాన్ని శుభ్రం చేస్తున్న కార్మికులు

వికసించిన బ్రహ్మకమలం


శ్వేత వర్ణంలో ఆకట్టుకుంటున్న బ్రహ్మకమలం

మండల కేంద్రం పెదపైపు వీధిలో ఓ ఉపాధ్యాయుడి పెరట్లో బ్రహ్మకమలం పుష్పాలు విరబూశాయి. పెదపైపు వీధిలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు దేవూరి శశికుమార్ పెరట్లో రెండేళ్లుగా బ్రహ్మకమలం మొక్కలు పెంచుతున్నారు.ఆదివారం సాయంత్రం పుష్పాలు ఒక్కసారిగా విచ్చుకుని, శ్వేత వర్ణంలో అమితంగా ఆకట్టుకుంటున్నాయి.

- చింతపల్లి/ఆంధ్రజ్యోతి

తాటిగుడ జలపాతం వద్ద సందడి

అనంతగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగుడ జలపాతాన్ని కేంద్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ విపుల్ ఉజ్వల్ ఆదివారం కుటుంబంతో కలసి సందర్శించారు. అరకు అందాలను తిలకించి, తిరుగు ప్రయాణంలోని మధ్యాహ్నం తాటిగుడ జలపాతం వద్దకు చేరుకున్నారు. చుట్టూ పచ్చని కొండలు, ఆనుకుని జాలువారే జలపాతంను వీక్షించారు. ఇక్కడి వ్యూపాయింట్ నుంచి పంటపొలాలను చూశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంధ్య, అగ్రి కల్చర్ అసిస్టెంట్ కుమారి, గ్రీన్ అంబాసిడర్ రవికుమార్ ఉన్నారు.

'ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి'

జి.మాడుగుల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల భావితరాలకు శాశ్వత ఉద్యోగ నియామక చట్టం తీసుకురావడాకి కృషి చేస్తున్న జేఏసీకి మద్దతు ప్రకటిస్తున్నట్టు మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఐసారంగి హనుమంతరావు తెలిపారు. మండలానికి వచ్చిన స్థానిక నేత రామారావు దొరతో కలిసి మాట్లాడారు. ఏజెన్సీలో డీఎస్సీ ప్రత్యేక నోటిఫికేషన్ విడుదలకు పోరాడుతున్న జేఏసీకి వారు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణతో పాటు పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

4, 6 తేదీల్లో ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు

చింతపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల నాలుగు, ఆరు తేదీల్లో నైతికత, మానవీయ విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు స్థానిక గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామేశ్వరం తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఈ రెండు పరీక్షలు రాయని విద్యార్థుల కోసం మరోసారి నాలుగో తేదీన నైతికత మానవీయ విలువలు, ఆరోతేదీన పర్యావరణ విద్య పరీక్షలను ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈపరీక్షలు ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఒరిజనల్ ధ్రువపత్రాలు మంజూరు కావని అన్నారు. విద్యార్థులు విధిగా ఈ పరీక్షలు రాయాలన్నారు.

కారు, బైక్ ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు


సంఘటనా స్థలంలో గాయాలతో రవి

అనంతగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం కొత్తమ్మతల్లి గుడి సమీపంలోని మలుపువద్ద కారు, బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. అరకు రవ్వలగూడకు చెందిన కిల్లో రవి ద్విచక్రవాహనంపై విజయనగరం నుంచి ఆదివారం స్వగ్రామానికి వెళుతుండగా.. కొత్తమ్మతల్లి గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న రైల్వేకు చెందిన కారు ఢీకొంది.. ఈ ప్రమాదంలోని రవికి నడుం, కాలు విరిగి పోయాయి. స్థానికులు సాయంతో ఆటోలో క్షతగాత్రుడిని ఎస్. కోట ఆస్పత్రికి తరలించారు.

అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించాలి: జడ్పీటీసీ సభ్యుడు


వర్తకులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ స్థలాల్లో నిర్మించిన కట్టడాలను వర్తకులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య సూచించారు. ఆదివారం స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి జడ్పీటీసీ దుకాణాల యజమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జ డ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఇచ్చిన వారం రోజుల గడువులోగా ఆర్‌అండ్‌బీ స్థలాల్లో నిర్మించిన కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. అక్రమణలపై అధికారులు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెడిరెడ్ల బే తాళుడు, జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు దురియా హే మంత్ కుమార్, వైసీపీ నాయకుడు జల్లి సుధాకర్, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణ,గ్రామపెద్దలు గంజారి రమణ, షేక్ రహ్మాన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే మత్స్యలింగం


మఠం పంచాయతీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. ఆదివారం మండలంలోని మఠం పంచాయతీ జాకారవలస గ్రామంలోడ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్నానన్నారు. వీటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాననిసూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మాంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్ శాంతికుమారి, వైసీపీ నేతలు రవిప్రసాద్, అనిల్, పూర్ణిమ, కొండబాబు పాల్గొన్నారు

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి: ఎస్ఐ

ముంచంగిపుట్టు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వాహన చోదకులు విధిగా నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను జీపులు, ఆటోల్లో ఎక్కించరాదని, అతివేగంగా నడపొద్దని సూచించారు.

ఉపాధ్యాయుల బదిలీల్లో తొలగని గందరగోళం

- ఏజెన్సీలో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు స్కూల్ అసిస్టెంట్ల విముఖత
- ఇంకా 26 ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీ
- ఎస్‌జీటీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం కొనసాగుతోంది. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్‌అసిస్టెంట్లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయమే దీనికి కారణమన్న వాదన ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించడాన్ని ఎస్‌జీటీలు వ్యతిరేకిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు పని భారం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన చేసిన స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంగా వెళితే మూడు నుంచి ఐదు తరగతులకు బోధన చేయడం ఏమిటన్న వాదన వారిలో ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో సర్దుబాటుతో మిగిలిన స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు సమ్మతించినా... ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు వెళ్లడానికి విముఖత చూపుతున్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా వెళ్లడానికి స్కూల్ అసిస్టెంట్లకు ఇచ్చిన గడువు ముగిసింది. మొత్తం 563 పాఠశాలల్లో ఇంకా 26 పాఠశాలలకు ఎవరూ ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో మిగులుగా ఉన్న 86 మంది స్కూల్ అసిస్టెంట్లలో 26 మందిని ఏజెన్సీకి పంపనున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లగా పదోన్నతి కల్పించి వారిని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పంపితే మంచిదని ఎస్‌టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభిప్రాయపడ్డారు.

మెగా డీఎస్సీ మోడల్ పరీక్షకు స్పందన


పరీక్షలను పర్యవేక్షిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పాడేరురూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు పిలుపు మేరకు పీఆర్‌టీయూ నేతల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అక్షర పబ్లిక్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన మెగా డీఎస్సీ మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది.

జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులు పరీక్ష రాశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు మాట్లాడుతూ ఈ నమూనా పరీక్ష డీఎస్సీ అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పరీక్ష నిర్వాహణపై అభ్యర్థులు యూనియన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్రా మోహన్‌రావు, ఎం.శ్రీనివాస్, మండల అధ్యక్షురాలు వంజంగి హేమలత, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీరేలా..

- 5 వేల లీటర్ల సామర్థ్యంతో గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణం
- ఒక్కో దానికి రూ. 30 వేల వ్యయం

అనంతగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో పశువులకు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఆదేశాలపై జాతీయ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో తాగునీటి తొట్టెలను నిర్మాణానికి పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టారు. ఈ లక్ష్యాలను అధిగమించే పనిలో ఆయా మండలాల అధికారులు చురుగ్గా కృషిచేస్తున్నారు..

మండలంలో 60 నీటి తొట్టెలు

మండలంలోని 24 పంచాయతీలకు పశువులు అధికంగా ఉండే పంచాయతీల్లో పలు గ్రామాల్లో తాగునీటి తొట్టెలు నిర్మించాలని లక్ష్యం పెట్టుకున్నారు. కొండిబ, జీనబాడు, చిలకలగెడ్డ, కొ త్తూరు, పెదబిడ్డ, టోకూరు, అనంతగిరి పంచాయతీల్లో పలు గ్రామాల్లో లక్ష్యం 60కు గాను 34 తాగునీటి తొట్టెలను నిర్మించారు. ఎంపీడీవో ఏవీవీ.కుమార్, ఏపీవోలు సన్యాసినాయుడు, అర్జున్, క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రత్యేక కృషిచేస్తున్నారు. పశువులకు కోసం


తైడ గ్రామంలో తాగునీటి తొట్టెను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఆయా గ్రామాల్లో నిర్మించిన ఒక్కో తాగునీటి తొట్టె 5వేల లీటర్ల సామర్థ్యం కలిగి ఉంటుంది. దీని ఒక్కో దాని నిర్మాణానికి రూ. 30 వేల జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు మంజూరు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.. వేసవిలో తాగునీటి పశువుల కొరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్మాణాలపై దృష్టిపెట్టామని చెబుతున్నారు. తాగునీటి తొట్టెలు పశువులకు ఉపయోగపడుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

రైతులకు మేలు చేకూరేలా నీటి తొట్టెలు



రైతులకు మేలు చేకూరేలా పశువులకు తాగునీటి తొట్టెల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టిసారించింది.. మండలంలో 34 నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషిచేస్తున్నాం.

- ఏవీవీ కుమార్, ఎంపీడీవో అనంతగిరి

నేరాల నియంత్రణకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

ఆ అవరసరం లేదు. యాప్ నుంచి అలర్ట్ వచ్చినప్పుడు లాడ్జికి వెళ్లి తనిఖీ చేస్తే సరిపోతుంది. నేరాలను అదుపు చేయడానికి, ప్రజలకు భద్రత కల్పించడానికి ఈ యాప్ చాలా ఉపయోగ పడుతుందని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. రోజూ యాప్ నుంచి అలర్ట్‌లు వస్తున్నాయని, సీఐలు, ఎస్ఐలు వెళ్లి తనిఖీ చేస్తున్నారని చెప్పారు.

'మాకవరపాలెం'లో ఎంఎస్ఎంఈ పార్క్

... 5వ పేజీ తరువాయి

సిద్ధంగా వున్నట్టు చెప్పారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని తెలుగుదేశం పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇది ఏర్పాటైతే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు.

రాంకీ బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు తక్షణమే స్పందించి రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యర్థ జలాలు విడిచిపెట్టడం వలన భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు షురూ..

... 5వ పేజీ తరువాయి

కావాలి. ఆఫీస్ బేరర్స్ కాని ఉద్యోగులు మూడు నుంచి ఐదేళ్లలోపు ఒకే ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తుంటే.. తప్పనిసరిగా లోకల్‌గా ఉన్న మరో ఇన్‌స్టిట్యూట్‌కు బదిలీ కావాల్సి ఉంటుంది. లోకల్‌గా ఖాళీ లేకపోతే తప్పనిసరిగా మరో ప్రాంతానికి వెళ్లాల్సిందే. ఉద్యోగి బదిలీ కావాలనుకుంటే ఐదు ప్రాంతాలను ఆప్షన్‌గా ఎంచుకోవచ్చు. ఈ మేరకు ఆయా కేటగిరీలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలను ఈ నెల మూడో తేదీలోగా కార్యాలయా ఆవరణలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఉద్యోగులు తమ దరఖాస్తులను బదిలీ అధికారికి మూడో తేదీలోగా అందించాలి. మార్పులు, చేర్పులకు సంబంధించి 4, 5 తేదీల్లో కంట్రోలింగ్ అధికారికి అందించవచ్చు. 6 నుంచి 8వ తేదీలోగా ఉన్నతాధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలిస్తారు. 9న ఉద్యోగులు ఎంపిక చేసుకున్న స్థానాలతో కూడిన జాబితాను పొందుపరిచి గ్రీవెన్స్‌లను కోరతారు. ఏమైనా అభ్యంతరాలుంటే 10, 11 తేదీల్లో తెలియజేయవచ్చు. 12 నుంచి 14వ తేదీ వరకు అభ్యంతరాలను నివృత్తి చేసి తుది జాబితాను రూపొందిస్తారు. 15 నుంచి 17వ తేదీ వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. యువకుడి మృతి



పవన్‌కుమార్ (ఫైల్)

ఎస్.రాయవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం సమీపంలో ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. వమ్మవరం గ్రామానికి చెందిన కొరుప్రోలు పవన్‌కుమార్, సమీపంలో ఉన్న అగ్రహారం గ్రామానికి చెందిన తన స్నేహితుడైన యాదగిరి భాస్కరరావుతో కలిసి బైక్‌పై పెనుగొల్లు వైపు వెళుతున్నారు. వమ్మవరం శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న పవన్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. భాస్కరరావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పవన్‌కుమార్ తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మార్టూరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకారం వివరాలివి. మార్టూరు గ్రామానికి చెందిన కరణం వరుణ్ (22) బీటెక్ చేశాడు. గత కొంతకాలంగా మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. తుమ్మపాల ఏలేరు కాలువ గట్టు మీదుగా బొజ్జన్నకొండకు వెళ్లే మార్గంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద అతడు శనివారం పురుగుల నివారణకు వినియోగించే మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గుర్తించిన తుమ్మపాల వాసులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కుటుంబ వివరాలను అతడి నుంచి తెలుసుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు ఆసుపత్రికి వచ్చేశారు. ప్రథమ చికిత్సల అనంతరం వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా, స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న వరుణ్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకట అప్పాజీరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

మద్యం మత్తులో స్పృహ కోల్పోయి డ్రైవర్ మృతి

లంకెలపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పూటుగా మద్యం సేవించి ఓ డ్రైవర్ మృతిచెందిన సంఘటన లంకెలపాలెం ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖపట్నానికి చెందిన జి.ధనపాల్ బాలాజీ (55) ఫార్మాసిటీలో ఓ వాహనానికి ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పూటుగా మద్యం సేవించి ఇక్కడున్న బ్రిడ్జి వద్ద స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఎంతటికీ తెలివి రాకపోవడంతో స్థానికులు పరవాడ పోలీసులు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా, అప్పటికే మృతిచెందిన ఉన్నట్టు గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిని పూర్తి వివరాలకు తెలియాల్సి ఉందని సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి నిందితుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గోవిందరావు

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన కె.హరీశ్, యు.కన్నన్ రైలులో విశాఖపట్నం వచ్చారన్నారు. చీడికాడ మండలానికి చెందిన ఓ వ్యక్తితో వారికి పాత పరిచయం ఉందని తెలిపారు. అతని దగ్గర ఎనిమిది కిలోల గంజాయి కొలుగోలు చేసి బ్యాగులో రెండేసి ప్యాకెట్లు చొప్పున పెట్టుకుని నర్సీపట్నం వచ్చారని, ఇక్కడ నుంచి బస్సులో తుని వరకు వెళ్లి రైలులో కోయంబత్తూరు వెళ్దామని ప్లాన్ చేసుకున్నారని సీఐ తెలిపారు. చోడవరం రోడ్డులో ఇద్దరు నడుచుకుని వస్తుండగా పెదబొడ్డేపల్లి కూడలి వద్ద పట్టణ ఎస్‌ఐ రమేశ్ అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరిలో హరీశ్‌కు గంజాయి తాగే అలవాటు ఉందని, కన్నన్ పొట్లాలు కట్టి విక్రయిస్తుంటాడని ఆయన చెప్పారు. వారి నుంచి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరిపై అట్రాసిటీ కేసు

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిఘట్టానికి చెందిన అల్లంపల్లి ఈశ్వరరావుపై దాడి చేసిన పప్పల అప్పలనాయుడు, రేలంగి రాజేశ్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు కేసును దర్యాప్తు చేస్తున్నారని ఆయన తెలిపారు. పాల్‌ఘాట్ సెంటర్‌లో సీసీ పుటేజీలు పరిశీలించామని, ఈశ్వరరావుపై ఇద్దరు నిందితులు పిడి గుద్దులతో దాది చేసినట్టు పుటేజీలో కనిపిస్తుందని సీఐ వివరించారు. అల్లంపల్లి ఈశ్వరరావు, పప్పల అప్పలనాయుడుపై రౌటీషీట్లు ఉన్నాయన్నారు. పోలీసు స్టేషన్‌లో అప్పలనాయుడుపై 17, ఈశ్వరరావుపై తొమ్మిది కేసులు ఉన్నాయని తెలిపారు. కౌన్సిలర్‌పై సోషల్ మీడియా వేదికగా దూషణలు చేయడంతోనే ఈశ్వరరావుపై దాడి చేశామని నిందితులు చెప్పారని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

రారండోయ్ వేడుక చూద్దాం..

- మాడుగుల మోదకొండమ్మ జాతర రేపు
- గ్రామంలో భారీ విద్యుత్ దీపాలంకరణలు, సెట్టింగులు
- బంధువులతో హడావిడిగా మండల కేంద్రం



శతకంపట్టుకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన సెట్టింగులు, విద్యుత్ దీపాలంకరణలు

మాడుగుల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, మాడుగుల భక్తుల కొంగుబంగారం మోదకొండమ్మ జాతర మంగళవారం జరగనుంది. ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు గ్రామంలో భారీ విద్యుత్ దీపాలంకరణలు, సెట్టింగ్‌లతో ముస్తాబు చేశారు. విద్యుత్ వెలుగులతో గ్రామంలో పండగ సందడి నెలకొంది. అమ్మవారి మహోత్సవానికి సంబంధించి దూర ప్రాంతాల్లో ఉండే భక్తులు ఇప్పటికే గ్రామానికి చేరుకుంటున్నారు. విద్యుత్ దీపాలంకరణ తిలకించేందుకు గ్రామస్థులతో పాటు బంధువులు తరలి రావడంతో మండల కేంద్రంలో హడావిడి కనిపిస్తోంది.

ప్రతి ఏటా జూన్‌లో అమ్మవారి ఉత్సవం

ప్రతీ ఏడాది జూన్ మొదటివారంలో మోదకొండమ్మ జాతర నిర్వహిస్తారు. ఉత్సవం సందర్భంగా నెలరోజుల ముందు ప్రధాన ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహం, పాదాలు, ఘటాలను స్థానిక శతకంపట్టు వద్దకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి కొలువు ఉంచుతారు. అక్కడ ఉన్న నెల రోజుల పాటు ప్రతీ రోజు అమ్మవారి పూజలు చేస్తారు. నెల రోజుల అనంతరం జరిగే ఉత్సవం రోజున సాయంత్రం కొలువుతీరిన అమ్మవారి విగ్రహాలు, పాదాలు, ఘటాలను ఊరేగింపుగా తిరిగి అమ్మవారి ఆలయానికి తీసుకొస్తారు.

ఆలయ అభివృద్ధికి అహర్నిశ సేవలు

1979-81లో మాడుగుల తహసీల్దార్ పనిచేసిన హంపన్న అమ్మవారి ఆదేశాల మేరకు మాడుగుల శివారు పాడేరు వెళ్లే మార్గంలో శిల్లి ఎల్లయ్యఅమ్మవారి పూరె గుడిసె స్థానంలో నూతన ఆలయ నిర్మాణంతో అమ్మవారి విగ్రహ తయారికి నాంది పలికారని పూర్వీకుల నుంచి చెబుతున్నారు. అప్పటినుంచి అమ్మవారికి మరింత ఆదరణ పెరిగింది. అనంతరం అమ్మవారి ఆలయాన్ని దినదినాభివృద్ధి చేసేందుకు స్థానికులు కొప్పాక కామేశ్వరరావుతో పాటు అనేక మంది గ్రామ పెద్దలు సాయం అందించారు. అలాగే వివాహాది శుభకార్యాలు చేసిన అనంతరం అమ్మవారికి పండుగ నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.

అమ్మవారి జాతరకు పూర్తి స్థాయి ఏర్పాట్లు

మండల కేంద్రంలో మంగళవారం జరగనున్న మోదకొండమ్మ జాతరకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఉత్సవం సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి లక్షమంది వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రజలు వస్తారన్నారు. దీంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను కోరినట్టు ఆయన తెలిపారు.

పండుగలా రేషన్ దుకాణాల పునఃప్రారంభం





చోడవరం: అన్నవరం రేషన్ డిపోలో సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు... బుచ్చెయ్యపేట: వడ్డాదిలో సరకులు అందిస్తున్న బత్తుల తాతయ్యబాబు

చోడవరం/రావికమతం/రోలుగుంట/బుచ్చెయ్యపేట/మాడుగుల/దేవరాపల్లి/చీడికాడ/కె.కోటపాడు/మాకవరపాలెం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/నాతవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో రేషన్ దుకాణాలను ఆదివారం పండుగ వాతావరణంలో పునఃప్రారంభించారు. చోడవరం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు దుకాణాలను ప్రారంభించి లబ్ధిదారులకు సరకులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రేషన్ కార్డుదారులకు సౌలభ్యం కోసమే ప్రభుత్వ డిపోలను పునఃప్రారంభించిందని చెప్పారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది గ్రామంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు చౌక ధరల దుకాణాన్ని ప్రారంభించి సరకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాలుగు మండలాల తహసీల్దార్లు రామారావు, బి.వెంకటరమణ, ఎం.లక్ష్మి, నాగమ్మ, కూటమి నాయకులు గూనూరు మల్లునాయుడు, గూనూరు పెదబాబు, సిరిపురపు రమేశ్, దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, పప్పు శ్రీను, రాజాన కొండనాయుడు,వజ్రపు లీలా, ఎం.నాయుడు, గంజి మోదునాయుడు, వజ్రపు శివ, కోరుకొండ కామలక్ష్మి, దొండా నరేశ్, దొండా సాయి, ఈ.అప్పారావు, మేడివాడ రమణ, యడ్ల రామమూర్తి, గోకివాడ కోటేశ్వరరావు, తమరాన దాసు, దోడి కిశోర్, దొండా నరేశ్, సాయం శేషు, దేవర అప్పారావు, దొండా గిరి, నానాజీ, మలిరెడ్డి బుజ్జి పాల్గొన్నారు. అలాగే మాడుగుల మండలంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జాగ్గారావు, సర్పంచ్ యడ్ల కళావతి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి మోహన్‌రావు, తహసీల్దార్ కె.రమాదేవి రేషన్ దుకాణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రంజిత్‌వర్మ, పుప్పాల రమేశ్, లెక్కల కాశిబాబు, రొబ్బా మహేశ్, ఊడి అప్పారావు, డిల్లీ నానాజీ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మయ్య పాల్గొన్నారు. చీడికాడలో తహసీల్దార్ కిశోర్‌లింకన్ రేషన్ డిపోను ప్రారంభించారు. నాయకులు గాలి సామాలమ్మ, గండి ముసలినాయుడు, అప్పారావు పాల్గొన్నారు. కె.కోటపాడు మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ దోకల లక్ష్మినరసింహమూర్తి డిపోను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, కూటమని నాయకులు పైలా అమ్మాజీ, పైలా గంగునాయుడు, ఈర్లి రమేశ్, చిరంజీవి, సంతోశ్ పాల్గొన్నారు. దేవరాపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ ఎం.లక్ష్మీదేవి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ రేషన్ డిపోలను ప్రారంభించారు. నాయకులు చరకాన సూర్యనారాయణ, కృష్ణమూర్తి, పెంటమ్మ పాల్గొన్నారు. మాకవరపాలెంలోని శెట్టిపాలెం గ్రామంలో ఆర్డీవో వీవీ.రమణ రేషన్ డిపోలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకవరపు రామారావు, నాయకులు ఆర్వైపాత్రుడు, ఎ.రామునాయుడు, రుత్తల నందకిశోర్ పాల్గొన్నారు. గొలుగొండ మండంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కామిరెడ్డి గోవింద్, కర్రి నాయుడు, చిటికెల సాంబమూర్తి, సుర్ల బాబ్జి రేషన్ షాపులను ప్రారంభించారు. నాయకులు కొల్లి సత్యనారాయణ, చింతల కాంతం, చిటికెల తారకవేణుగోపాల్, బొడ్డు జమీలు, పెట్ల నారాయణమూర్తి, పి.రాజులునాయుడు, గొంప వాసు తదితరులు పాల్గొన్నారు.



మాకవరపాలెంలో సరకులు అందిస్తున్న ఆర్డీవో రమణ

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



భూలక్ష్మికి ఆటోను అందిస్తున్నఎమ్మెల్యే రాజు

రావికమతం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అభ్యున్నతి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు చెప్పారు. మండలంలోని టి.అర్జాపురంలో అబ్రహం డ్వాక్రా సభ్యురాలు బంగారు భూలక్ష్మికి పీఎం అజయ్ పథకం ద్వారా మంజూరైన ఆటోను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ రాణించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదన్నారు. మహిళలు ఒకప్పుడు ఇంటికే పరిమితంగా ఉండేవారని, ఇప్పుడు అన్ని రంగాల్లోనూ శక్తివంతులుగా ఎదుగుతున్నారని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలు పీఎం అజయ్ పథకానికి అర్హులుగా చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’ విజయవంతం చేయండి

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లిలో పోస్టర్ విడుదల చేస్తున్న బూడి ముత్యాలనాయుడు

చోడవరం/బుచ్చెయ్యపేట/దేవరాపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు చోడవరం నియోజకవర్గం కేంద్రంతో పాటు బుచ్చెయ్యపేట, దేవరాపల్లి మండలాల్లో వైసీపీ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. దేవరాపల్లిలో బూడి మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టే ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో చోడవరం, దేవరాపల్లి ఎంపీపీలు గాడి కాసు, చింతల బుల్లిలక్ష్మి, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యులు కర్రి సత్యం, దొండా రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షులు బాబూరావు, కె.అచ్చెంనాయుడు, వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు పుల్లేటి వెంకటేశ్, బొడ్డేడ సూర్యనారాయణ, ఆదిగణపతి, కోన చంద్రరావు, కేవీరమణ, దొండా నారాయణమూర్తి, విజయకుమార్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయండి

- జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

మాడుగుల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం జరిగే మోదకొండమ్మ జాతర కోసం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డీపీవో ఆర్.శిరీషారాణి అధికారులను ఆదేశించారు. ఆదివారం మాడుగుల వచ్చిన ఆమె గ్రామంలో పారిశుధ్యంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. అలాగే పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, సర్పంచ్ యడ్ల కళావతి, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరాపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జీనబాడు రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు తగిలాయి. అనంతగిరి మండలం కివర్ల గ్రామానికి చెందిన కేత దేముడు దేవరాపల్లి నుంచి కివర్ల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, అదే సమయంలో పెదబయలు నుంచి ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తున్న ఎస్.ప్రసాద్ జీనబాడు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు తగలడంతో దేవరాపల్లి పీహెచ్‌సీలో చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు 108లో కేజీహెచ్‌కు తరలించారు.

రోలుగుంటలో అక్రమ మైనింగ్ అరికట్టడంలో అధికారుల విఫలం

- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు

రోలుగుంట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు ఏమీ చేయలేకపోతున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రోడ్డు మెటల్‌పై ప్రభుత్వానికి రాయల్టీని చెల్లించకుండా అక్రమ మైనింగ్ చేపడుతున్నారన్నారు. అలాగే స్టోన్ క్రషర్ల ద్వారా మితిమీరిన కాలుష్యం ఏర్పడుతుందన్నారు. నిత్యం గ్రామీణ రహదారులను ధ్వంసం చేస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో అక్రమ మైనింగ్‌పై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని రాజు తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

బుచ్చెయ్యపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మెహనరావు చెప్పారు. మండలంలోని కొండపాలెం, కేపీ.అగ్రహారం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ఎం.రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు ఎం.వెంకటేశ్, టి.కిరణ్, ఎస్.సత్తిబాబు, ఎస్.కిశోర్, సర్పంచులు ఎం.భవాని, గోపిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు ఎంవీ.స్వామినాయుడు పాల్గొన్నారు.

డీఎస్సీ నమూనా పరీక్షకు విశేష స్పందన

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ రాసే అభ్యర్థుల కోసం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నమూనా పరీక్షకు విశేష స్పందన లభించింది. నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఈ పరీక్షకు 220 మంది హాజరయ్యారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా ఎంపిక కావడానికి సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు భయం పోగొట్టి ధైర్యంగా డీఎస్సీ పరీక్ష రాయడానికి ఈ నమూనా పరీక్ష ఏర్పాటు చేశామని పీఆర్‌టీయూ అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.అప్పారావు, నర్సీపట్నం మండల శాఖ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, కార్యదర్శి రమేశ్, జిల్లా అసోసియేట్ ఉపాధ్యక్షుడు కురచ రమణ, సభ్యుడు దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా శిక్షణ శిబిరం

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. శిక్షణ తీసుకున్న క్రీడాకారులకు ముఖ్య అతిథి డాక్టర్ గౌతమి క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. బాక్సింగ్ గ్లౌవ్స్, కరాటే పాడ్స్, టీ షర్టులను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ కోచ్ అబ్బు, అసోసియేట్ సభ్యులు వెలగా నారాయణరావు, ఎస్.శ్రావణ్, వి.జగన్నాథ్, బంగారునాయుడు, పాల్గొన్నారు.

200 మందికి యోగా శిక్షణ

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నలంద పాఠశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసినట్టు మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. శిక్షణ తీసుకున్న 200 మంది సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. వార్డుల్లో యోగసనాలపై ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. వచ్చే నెల 18వ తేదీలోగా మూడు విడతల్లో 150 మందికి శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు.

క్షతగాత్రుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నర్సీపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాల్‌ఘాట్ కూడలి వద్ద శనివారం రాత్రి జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన అల్లంపల్లి ఈశ్వరరావును ఆదివారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ పరామర్శించారు. ఆయనతో మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, చింతకాయల సన్యాసిపాత్రుడు, కౌన్సిలర్లు ఉన్నారు. అల్లంపల్లి ఈశ్వరరావు మీద జరిగిన దాడిని ఖండిస్తూ దళిత నాయకులు అబీద్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. దాడి చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొట్టా నాగరాజు, ఆరిగొల్లు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో అధిక దిగుబడులు

మాకవరపాలెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి చిరంజీవి చెప్పారు. పాపయ్యపాలెం, తూటిపాల గ్రామాల్లో ఆదివారం రైతులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వినియోగిస్తే భూసారం పెరుగుతుందన్నారు. అలాగే నవధాన్యాల పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా వ్యవసాయధికారాల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీటీ కృషి విజ్ఞాన యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత్‌గౌడ్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు

పోరాట యోధుడు ఎర్రమ్మనాయుడు

కృష్ణాదేవిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల పోరాట యోధుడు గొలుగొండ మాజీ ఎంపీపీ, సీపీఐ నేత లగుడు ఎర్రమ్మనాయుడు అని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు కొనియాడారు. కృష్ణాదేవిపేటలో ఆదివారం జరిగిన ఎర్రమ్మనాయుడు వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులు, భూ పోరాటాల్లో ఆయన ప్రముఖ పాత్ర వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ.రమణ, సీపీఐ నాయకులు మేకా సత్యనారాయణ, మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ, గురుబాబు, లగుడు శ్రీను, ఎర్రమ్మనాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రతిభావంతురాలికి జవహార్ క్లబ్ అసోసియేషన్ పురస్కారం

చోడవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఆత్యేయపురపు గాయత్రిదేవిని జవహార్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సత్కరించారు. మండలంలోనే ఎక్కువ మార్కులు సాధించిన గాయత్రిదేవికి సీఐ అప్పలరాజు చేతులమీదుగా నగదు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పోతల ప్రకాశ్, ప్రముఖులు మంతా గౌరీశంకర్, పి.రవీంద్ర, ఎం.నాగేశ్వరరావు, పాల్గొన్నారు.